## క్లుప్తంగా

### రహదారిపై వర్షం నీరు



జాతీయ రహదారిపై నుంచి ప్రవహిస్తున్న వర్షం నీరు

సారవకోట: నరసన్నపేట నుంచి ఒడిశాలోని మోహనకు వెళ్లే జాతీయ రహదారి 326–ఎలో అలుదు సమీపంలో వర్షపు నీరు రోడ్డు పైనుంచి ప్రవహిస్తుంది. వర్షాలు పడే సమయంలో పొలాల నుంచి వర్షపు నీరు బయటకు వెళ్లేందుకు ఇక్కడ కాలువలు ఏర్పాటు చేయక పోవడంతో వర్షం నీరు నిలిస్తుంది.ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ రోడ్డు నిర్మాణ పనులు చేసేటప్పుడు సంబంధిత కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా వ్యవహరించడంతో ఇటువంటి సమస్య తలెత్తుతుందని ప్రయాణికులు అంటున్నారు.

### నేడు మండల సమావేశం

హిరమండలం: మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించనున్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ టి.మేనక అధ్యక్షతన ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ డీడీ స్వరూపారాణి శనివారం తెలిపారు. అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన సమగ్ర సమాచారంతో హాజరుకావాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొనాలని కోరారు.

### రూ.51 వేల ఆర్థికసాయం



మాట్లాడుతున్న సతీష్, సంతోష్

పాతపట్నం: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఉన్న లవ్లీ చిల్డ్రన్ హోమ్ అనాథ ఆశ్రమంలో ఉంటున్న విద్యార్థులను ప్రతి ఒక్కరూ సహకరించాలని పాతపట్నంకు సైలాడ సతీష్, యర్లంగి సంతోష్ అన్నారు. అనాథ ఆశ్రమంలో చదువుతున్న 72 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. ప్రభుత్వం యూనిఫాం అందించిందని, కుట్టించేందుకు డబ్బులేక పోవడంతో సతీష్, సంతోష్‌లు తమ స్నేహితులుతో కలిపి రూ.51,100 సమకుర్చారు. సతీష్, సంతోష్‌లను గ్రామస్తులు అభినందించారు.

### నైపుణ్యాలను వెలికితీయాలి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ విజయ

నరసన్నపేట: నైపుణ్యాలను వెలికితీసి, ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేస్తేనే మహిళా సాధికారిత సాధ్యమవుతుందని ఐతం కళాశాల ఇంగ్లిష్ ప్రొఫెసర్ కె.విజయ అన్నారు. స్థానిక పద్మావతి జూనియర్ కళాశాలలో మహిళా సాధికారిత అనే అంశంపై శనివారం సదస్సు నిర్వహించారు. విజయ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లోనూ ముందుంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తూ ఎందరో మహిళలు చరిత్రలో తమకంటూ ఓ స్థానాన్ని కల్పించుకున్నారన్నారు. అటువంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మహిళలు స్థితిగతులు బాగుపడనిదే సమాజం అభివృద్ధి చెందదన్నారు. అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ అవరోధాలను అధిగమిస్తూ ముందుకు సాగాలని సూచించారు. కళాశాల డైరెక్టర్ దుదర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### రాత్రి గస్తీపై ప్రత్యేక దృష్టి



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ శృతి

ఆమదాలవలస: రాత్రి గస్తీపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎస్పీ శృతి సూచించారు. పట్టణంలోని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాన్ని శనివారం సందర్శించారు. ఈ ల్ పరిధిలో ఉన్న నాలుగు పోలీస్ స్టేషన్లలో ఉన్న కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా పలు కేసుల పరిష్కారానికి దిశానిర్దేశం చేశారు. సర్కిల్ పరిధిలో ఎటువంటి చోరీలు, ఇతర నేరాలు జరగకుండా రాత్రివేళ గస్తీ నిర్వహించే పోలీసులు అప్రమత్తంగా ఉండేలా పర్యవేక్షించాలని సీఐ వాయునందన దివాకర్, ఎస్ఐ వెంకటేష్‌కు సూచించారు. మహిళలు, యువతులు, విద్యార్థినుల రక్షణ పట్ల చేపట్టాల్సిన విధివిధానాలను వివరించారు.

### విధులను సక్రమంగానే నిర్వహిస్తున్నా..

సరుబుజ్జిలి: విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు అప్పగించిన ప్రతీ పనిని చేస్తున్నానని విజయరాంపురం విద్యుత్ లైన్‌మన్ (ఎనర్జీ అసిస్టెంట్) పెంటయ్య శనివారం తెలిపారు. విజయరాంపురం సర్పంచ్ బెండి అప్పలనాయుడు ఆయనపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానన్న వార్తకు స్పందించారు. గ్రామంలో ప్రజాప్రతినిధులు, ప్రజలు చెప్పిన విద్యుత్ సమస్యలపై వెంటనే స్పందించి మరమ్మతులు చేస్తున్నానని తెలిపారు.



### • అవగాహన

నైతిక విలువలపై విద్యార్థులకు అవగాహన ఉండాలని వ్యక్తిత్వ వికాస నిపుణులు, రాజాం పాఠశాల ఆంగ్లం ఉపాధ్యాయుడు కొల్లి సాయి మురళి అన్నారు. సరుబుజ్జిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణ లో ప్రిన్సిపాల్ రాబిల్లి భూషణరావు అధ్యక్షతన ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శనివారం వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ పీఓ రమేష్‌సాహు, అధ్యాపకులు నాగేంద్ర, శ్రీనివాసరావు, సంగీత, విజయ్‌వినోద్‌రాజు, విజయ్ పాల్గొన్నారు.

– సరుబుజ్జిలి

### • జలకళ

ఎల్.ఎన్.పేట మండలంలోని సుమారు 7 వేల ఎకరాలకు సాగునీరు అందించే వంశధార కుడి ప్రధాన కాలువలో సాగునీటి ప్రవాహం జోరుగా సాగుతుంది. ఈ కాలువ ద్వారా సాగునీటిని విడిచిపెట్టారు. ఈ కాలువకు అనుసంధానంగా ఉన్న 4ఎల్ పిల్ల కాలువ నుంచి 11ఎల్ ఓపెన్ హెడ్ ఛానల్ వరకు అన్ని కాలువల ద్వారా నీటిని విడిచి పెట్టామని వంశధార ఏఈ తాడి శ్రీనివాసరావు తెలిపారు.

– ఎల్.ఎన్.పేట





### • వితరణ

పాతపట్నం మండలంలోని పెద్దలోగిడి మండల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విశ్రాంత సెక్రటరీ రాజేశ్వరరావు మనవడు డోలయజ్ఞ పుట్టినరోజు సందర్భంగా శనివారం బ్యాగులు అందజేశారు. పాఠశాలలో చదువుతున్న 1 నుంచి 5వ తరగతి విద్యార్థులు 50 మందికి రాజేశ్వరరావు చేతులమీదుగా బ్యాగులు అందించామని హెచ్ఎం వి.బుడ్డి తెలిపారు. ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

– పాతపట్నం

### • పరిశుభ్రం

అంటువ్యాధులు వ్యాప్తిని అరికట్టడంలో భాగంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు మేజరు పంచాయతీ నరసన్నపేటలో చురుగ్గా నిర్వహిస్తున్నారు. మండల పరిషత్ ఆవరణలో ఉన్న మంచినీటి ట్యాంకులు, షంపులను శనివారం శుభ్రం చేసి క్లోరినేషన్ చేపట్టారు. మారుతీనగర్‌తోపాటు పలు వీధుల్లో నీటి నిల్వ ఉన్న గుంతల్లో దోమల నివారణకు మోటాథిన్ గులికలు చల్లినట్లు ఈఓ చిన్నారావు తెలిపారు.

– నరసన్నపేట





### • తనిఖీ

నరసన్నపేట సబ్‌జైల్‌ను స్థానిక సివిల్ జడ్జి సి.హరిప్రియ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జైల్లో అందుతున్న సేవలను ఖైదీలకు అడిగి తెలుసుకున్నారు. మంచినీటి సదుపాయంతోపాటు ఇతర మౌలిక సదుపాయాలు, భోజనం సదుపాయం, రికార్డుల నిర్వహణపై ఆరా తీశారు. అవసరమైన వారికి ఉచితంగా న్యాయ సహాయం అందిస్తామన్నారు. జైల్లో ఎటువంటి ఇబ్బందులు ఉన్నా తెలియజేయవచ్చన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని విచారణ ఖైదీలకు సూచించారు.

– నరసన్నపేట

# అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా



బీసీ బాలుర వసతి గృహం గదిలో ఉన్న పేక ముక్కలు



విడిచిపెట్టిన మద్యం బ్యాటిళ్లు, గ్లాసులు



బీసీ బాలుర వసతి గృహం (పాతది)

కొత్తూరు:

మండల కేంద్రంలోని పాత తహసీల్దార్, ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం, పశువైద్య శాల, బీసీ బాలుర వసతి గృహ భవనాలు అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారాయి. గ్రామానికి సమీపంలో ఉన్న ఈ భవనాల్లో కొంతమంది జూదం ఆడటంతోపాటు మద్యం, గంజాయి సేవిస్తున్నారు. ఈ భవనాలు శిథిలావస్థకు చేరడంతో ఆయా శాఖల కార్యాలయాలు ప్రస్తుతం మరో ప్రాంతాల్లో నిర్వహిస్తున్నారు. ఖాళీగా ఉన్న ఈ భవనాలు కొంత కాలంగా అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా ఉన్నాయి. దీనిపై పోలీసులు, అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# హెల్మెట్ వినియోగంపై అవగాహన



ఆమదాలవలస: అవగాహన కల్పిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి మణి



నరసన్నపేట: హెల్మెట్ వినియోగంపై నినాదాలు చేస్తున్న విద్యార్థులు

ఆమదాలవలస: హెల్మెట్ ధారణతోనే ప్రాణాలకు రక్షణ లభిస్తుందని ఆమదాలవలస సివిల్ జడ్జి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మణి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలతో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు, హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. మోటార్ వాహనాల చట్టం విధి, విధానాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. హెల్మెట్‌ను బరువుగా కాకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించి ప్రాణాలను కాపాడుకోవాలన్నారు. ప్రతిఒక్కరికీ ట్రాఫిక్ నియమాలపై అవగాహన ఉండాలన్నారు. అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ సీపాన గోవిందరావు, సీఐ వాయునందన్ దివాకర్ యాదవ్, కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.ఎస్.ఎన్. స్వామి, న్యాయవాదులు తమ్మినేని అన్నంనాయుడు, బొడ్డేపల్లి మోహన్‌రావు, హనుమంతు అచ్చెన్నాయుడు, ప్రసాదరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

నరసన్నపేటలో..

నరసన్నపేట: ద్విచక్ర వాహనం నడిపే ప్రతిఒక్కరూ హెల్మెట్‌ను తప్పనిసరిగా వినియోగించాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ వైస్ కళాశాల ప్రిన్సిపాల్ శాంతి హేమ్ అన్నారు. కళాశాలలో హెల్మెట్ వాడకంపై శనివారం అవగాహన కల్పించారు. ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. వైస్ ప్రిన్సిపాల్ శాంతి హేమ్ మాట్లాడుతూ దేశంలో జరుగుతున్న ప్రమాదాల్లో ఎక్కువగా ద్విచక్ర వాహనాలే ఉన్నాయన్నారు. హెల్మెట్ ధరిస్తే చాలా వరకు మరణాల సంఖ్యను తగ్గించవచ్చన్నారు. ఎన్‌సీసీ ఆఫీసర్ రవికుమార్, ఎన్ఎస్ఎస్ పీఓ పి.అన్నాజీరావు తదితరులు పాల్గొన్నారు.

# పలు కుటుంబాలకు పరామర్శ



జలుమూరు: త్రినాథరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ధర్మాన కృష్ణదాస్



కొత్తూరు: ఎంపీపీ సావిత్రి కుటుంబాన్ని పరామర్శిస్తున్న రెడ్డి శాంతి

జలుమూరు: మండలం పరిధిలోని వెలుసోద గ్రామానికి చెందిన గురువు త్రినాథరావు రెండు రోజుల క్రితం పాము కాటుకు గురై మృతి చెందారు. ఆ కుటుంబాన్ని మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ శనివారం పరామర్శించారు. త్రినాథరావు కుమారుడు భార్గవరావుకు ధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో మాజీ ఎంపీపీ బగ్గు రామకృష్ణ, సచివాలయ కన్వీనర్ ధర్మాన జగన్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు దామ మన్మథరావు, బుద్దల శ్రీనివాసరావు, జుత్తు నేతాజీ, బోర సింహాచలం వైఎస్సార్‌సీపీ నాయకులు తండ్యేల జగన్నాథరావు, ఎస్.వి.రమణ, కోన దామోదరావు, మంత్రి అప్పన్న తదితరులు ఉన్నారు.

కొత్తూరు మండలంలో..

కొత్తూరు: మండలంలోని పలు కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి శనివారం పరామర్శించారు. ఎంపీపీ సవర సావిత్రి భర్త రమేష్, జెడ్పీటీసీ సభ్యురాలు మామ అనారోగ్యంతో బాధపడుతున్నారు. వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. కలిగాం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పాపారావు ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడటంతో ఆయనను పరామర్శించి వేగంగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మెట్టూరుకు చెందిన మాజీ సర్పంచ్ బర్రి గోవిందరావు భార్య పాపుడమ్మ ఇటీవల మృతి చెందారు. ఆ కుటుబాన్ని రెడ్డి శాంతి పరామర్శించారు. పరామర్శించిన వారిలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బూర్లె శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ గోగుల వరప్రసాదరావునాయుడు, మెట్టూరు సర్పంచ్ చక్రపాణి, అగతయూడి రంజిత్, ఎంపీటీసీ సభ్యుడు వనుము లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

హిరమండలంలో..

హిరమండలం: హిరమండలం వైస్ ఎంపీపీ వంగపల్లి సావిత్రి అత్త వంగపల్లి చిన్నమ్మ అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆమెను మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి శనివారం రాత్రి పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మీసాల వెంకటరామకృష్ణ, నాయకులు చిన్నారావు, శంకరరావు, మురళీకృష్ణ పాల్గొన్నారు.

పాతపట్నంలో..

పాతపట్నం: మండలంలోని చిన్నమల్లిపురం పంచాయతీ కొయ్యకొండ గ్రామానికి చెందిన సర్పంచ్ చిగుర్ల తిరుపతిరావు (గాంధీ) అన్న కృష్ణమోహన్ ఇటీవల మృతి చెందారు. శనివారం గాంధీ ఇంటికి వెళ్లి మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి పరామర్శించారు. వైస్ ఎంపీపీ ప్రదీప్, వైఎస్సార్‌సీపీ నాయకులు పనుకు మోహన్, గురాడి అప్పన్న ఉన్నారు.

ఎల్.ఎన్.పేట మండలంలో..

ఎల్.ఎన్.పేట: మండలంలోని కొమ్మువలస సర్పంచ్ రెడ్డి సుశీల అత్త, వైఎస్సార్‌సీపీ నాయకుడు సీతారాం తల్లి ఇటీవల మృతి చెందారు. శనివారం సీతారాం ఇంటికి మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి వెళ్లి పరామర్శించారు. లక్ష్మీనర్సుపేట పీఏసీఎస్ మాజీ చైర్మన్ కొల్ల కృష్ణ ఇటీవల గాయపడ్డారు. కృష్ణ ఇంటికి వెళ్లి పరామర్శించారు. త్వరగా కొలుకోవాలని ఆకాంక్షించారు. ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి, పార్టీ అధ్యక్షుడు పెనుమజ్జి విష్ణుమూర్తి, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు రెడ్డి రామారావు, మాజీ ఎంపీపీ శిమ్మ సాంబశివరావు, లోచర్ల మల్లేశ్వరరావు, పోన్నాన ధర్మారావు ఉన్నారు.

### కలెక్టర్, ఎస్పీలను కలిసిన ఎమ్మెల్యే



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

నరసన్నపేట: కలెక్టర్ స్వప్నిక్ దినకర్ పండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డిని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల్లో శనివారం కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

### ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న సర్పంచ్ పల్లి సురేష్

సరుబుజ్జిలి: మొక్కలు అధికంగా నాటి కాలుష్య భూతాన్ని తరిమికొట్టాలని ఇస్కలపాలెం సర్పంచ్ పల్లి సురేష్ తెలిపారు. ఇస్కలపాలెం పంచాయతీ పరిధిలోని పెద్దసవళాపురం గ్రామ సచివాలయం ఆవరణలో ఉపాధి ఆధ్వర్యంలో శనివారం మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉపాధి సోషల్ ఆడిట్‌కు సంబంధించిన గ్రామసభలో పాల్గొన్నారు. ఉపాధి హామీ పనులు, చెల్లింపుల వివరాలు సభలో సిబ్బంది చదివి వినిపించారు. సమావేశంలో ఉపాధి ఏపీఓ పార్వతి పాల్గొన్నారు.

### బంగారు 'రేష్మ'



బంగారు పతకాన్ని అందుకున్న రేష్మ

హిరమండలం: హిరమండలం విద్యార్థిని సదాశివుని రేష్మ ఇంజినీరింగ్‌లో సత్తా చాటింది. టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీ (ఐతమ్)లో టాపర్‌గా నిలిచింది. ఐతమ్‌లో ఈసీఈ విభాగంలో బీటెక్ పూర్తిచేసిన రేష్మ కాలేజీ టాపర్‌గా నిలిచింది. శనివారం కాలేజీలో స్నాతకోత్సవం నిర్వహించారు. విశాఖ డీఆర్‌డీఓ విభాగానికి చెందిన ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ చేతులమీదుగా పట్టా, బంగారు పతకాన్ని అందుకుంది. రేష్మ పలు క్యాంప్ ఇంటర్వ్యూలకు ఎంపికైంది. రేష్మ తండ్రి రామశంకరావు ఓ సాధారణ వ్యాపారి. ఈయనకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె బాసరలో ట్రిపుల్ ఐటీ పూర్తిచేసింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తుంది. రేష్మను పలువురు అభినందించారు.

# 2013 భూసేకరణ చట్టం అమలు చేయాలి



మాట్లాడుతున్న గోవిందరావు

మెళియాపుట్టి: మండలంలోని చీపురుపల్లి గ్రామానికి చెందిన ఆఫ్‌షోర్ నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం అమలు చేయాలని, లేకపోతే ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు అన్నారు. చీపురుపల్లి గ్రామాన్ని శనివారం సందర్శించి నిర్వాసితులతో సమావేశమయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రాజెక్ట్ కోసం వారు పుట్టి పెరిగిన గ్రామాలతో పాటుగా సర్వస్వాన్ని కోల్పోయారన్నారు. వారి త్యాగాలకు ఫలితంగా నిర్వాసిత కుటుంబాలకు ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. 2007లో ప్రాజెక్ట్ ప్రారంభమైనా నేటికీ నిర్వాసితులు చాలా మందికి న్యాయం జరగలేదన్నారు. పరిహారాలు అందక ఇప్పటికీ అధికారుల వెంట తిరుగుతున్నారని వాపోయారు. త్వరితగతిన నిర్వాసితుల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాలు చేయాల్సి వస్తుందన్నారు. నిర్వాసితులకు పార్టీ అండగా ఉంటుందని అధైర్యపడొద్దన్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నంబూరు షణ్ముఖరావు, రైతు సంఘం నాయకుడు సూరయ్య తదితరులు పాల్గొన్నారు.

# అబ్దుల్ కలాం ఆదర్శప్రాయుడు



కలాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సన్యాసిరావు

బూర్జ: మండలంలోని పెద్దపేట గ్రామంలో గల అర్డ్స్ సంస్థ కార్యాలయం ఆవరణలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతిని శనివారం నిర్వహించారు. అబ్దుల్ కలాం విగ్రహానికి సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలాంను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. రాష్ట్రపతిగా అనేక సేవలందించారు. ఎఫ్‌పీఓ కోఆర్డినేటర్ నూక అనూప్, సీఈఓ బి.శంకరరావు, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



జలుమూరు: మొక్కల సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు



సారవకోట: మొక్కలు నాటుతున్న ఎంఈఓ, సర్పంచ్



హిరమండలం: మొక్కలు నాటుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

జలుమూరు: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎంఈఓ బి.మాధవరావు అన్నారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మొక్కలు నాటారు. మొక్కలు మానవ మనుగడకు ప్రధానమన్నారు. ప్రతీ విద్యార్థి ఇంటి ఆవరణలో మొక్కలు నాటి పెంచాలన్నారు. ఉపాధ్యాయుడు మెండ రామారావు పాల్గొన్నారు.

సారవకోట మండలంలో..

సారవకోట: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని ఎంఈఓ రమణ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. హెచ్ఎం రామకృష్ణ, సర్పంచ్ శంకరబాబు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హిరమండలం మండలంలో..

హిరమండలం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు శనివారం మొక్కలు నాటారు. శిక్ష సప్తహ్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. అవలంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇకో క్లబ్‌లు ఏర్పాటు చేశారు. హెచ్ఎం గొల్లవాడు కన్వీనర్‌గా, సైన్స్ ఉపాధ్యాయుడు ధనుంజయరావు కో ఆర్డినేటర్‌గా వ్యవహరించారు. విద్యార్థులతో ఆరు కమిటీలను ఏర్పాటుచేశారు. ప్రతి కమిటీలో పది మంది విద్యార్థులను నియమించారు. గైడ్ టీచర్లుగా రమేష్, జయ, కృపానందం, మాధవరావు, రమణమూర్తి, గిరిబాబు, సత్యనారాయణ వ్యవహరించారు. మొక్కలు నాటడమే కాకుండా సంరక్షించే బాధ్యతలు తీసుకుంటామని విద్యార్థులతో ప్రమాణం చేయించారు.

# పిల్లల చదువుపై ప్రత్యేక దృష్టి అవసరం



మాట్లాడుతున్న హెచ్ఎం నరసింహం

కొత్తూరు: మండలంలోని మెట్టూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగ శనివారం విద్యార్థులు తల్లిదండ్రులతో సహపక్తి భోజనం ఏర్పాటు చేశారు. పది, ఏడో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో హెచ్ఎం డీవీఎల్ నరసింహం సమావేశం నిర్వహించారు. తప్పనిసరి పరిస్థితిలో పిల్లలకు ఫోన్ ఇచ్చినా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఇంటి వద్ద పిల్లలను చదివించాలని సూచించారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధన కోసం ప్రత్యేక ప్రణాళికల ద్వారా ఇప్పటి నుంచే బోధన చేస్తున్నామన్నారు. విద్యతోపాటు నైతిక విలువలు బోధిస్తున్నామన్నారు. ప్రత్యేక తరగతులు నిర్వహించి మంచి ఫలితాలు కోసం కృషి చేస్తున్నట్లు చెప్పారు. తల్లిదండ్రులు అడిగిన పలు ప్రశ్నలకు హెచ్ఎం సమాధానం ఇచ్చారు. పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం



మాట్లాడుతున్న జడ్జి రోషిణి

పాతపట్నం:

మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం చేసుకోవద్దని పాతపట్నం కోర్టు సివిల్ జడ్జి రోషిణి అన్నారు. స్థానిక కిరణ్మయి డిగ్రీ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సులో భాగంగా మాదక ద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. జడ్జి మాట్లాడుతూ యువతీ, యువకులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. మత్తుకు బానిసలైతే జీవితాలు నాశనంతో పాటు భవిష్యత్తు అంధకారం అవుతుందన్నారు. డ్రగ్స్ కోసం నేరాలు చేస్తే, జీవితం నాశనం అవుతుందన్నారు. సీఐ నల్లి సాయి, ఎస్ఐ మహమ్మద్ యాసిన్, బార్ అధ్యక్షుడు బి.ఈ.సత్యనారాయణ, న్యాయవాదులు ఎం.రమణ, చంద్రభూషణరావు, ప్రిన్సిపాల్ జగన్మోహన్‌రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.